క్లుప్తంగా

ఉచిత ఆరోగ్యశ్రీ వైద్యశిబిరం రేపు

చీరాల: పట్టణంలోని కామాక్షి కేర్ హాస్పిటల్‌లో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ ఉచిత ఆరోగ్యశ్రీ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్ ఆదివారం తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రముఖ ల్యాప్రోస్కోపిక్ వైద్యులు గవిని లక్ష్మీనారాయణ హెర్నియా, పసరుతిత్తిలో రాళ్లు, కిడ్నీలో రాళ్లకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 90008 08198 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈఘటన ఆదివారం సాయంత్రం ఇసుక దరిశి సమీపంలో జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఇసుక దరిశి ఫ్లై ఓవర్ దిగువ భాగంలో తీవ్ర గాయాలతో పడి ఉన్న వ్యక్తిని గమనించిన స్థానికులు 108కు ఫోన్ చేశారు. ఘటనాస్థలికి చేరుకున్న 108 సిబ్బంది అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయాలపాలైన అతని పేరు లక్ష్మయ్య అని కర్నూలు అని మాత్రమే చెప్పాడన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం


నూతనంగా ప్రతిష్టించిన సీతారామ, లక్ష్మణుల విగ్రహాలు

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం సిండికేట్ వీవర్స్‌కాలనీలో సీతారాముల, లక్ష్మణ, ఆంజనేయ, వినాయకస్వామి వార్ల విగ్రహ ప్రతిష్టామహోత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్టామహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, యజ్ఞాల అనంతరం విగ్రహ ప్రతిష్టను అవ్వారి శివకళ్యాణ్‌శర్మ బృందం పండితుల మంత్రోచ్ఛారణలతో శాస్త్రోక్తంగా జరిపించారు. విఘ్నేశ్వర పూజ, వాయుప్రతిష్ట, తీర్థ స్వీకరణ, యజ్ఞసాయన, మహాభిషేకంతో నూతనంగా విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. అలానే అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను సీతారామాంజనేయ స్వామి మందిర భక్త బృందం కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ క్యాంప్‌ను వినియోగించుకోవాలి

కొమరోలు: స్థానిక 1, 2, 3 గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలందరూ ఆధార్ అప్‌డేట్ స్పెషల్ క్యాంప్‌ను వినియోగించుకోవాలని కొమరోలు గ్రామ కార్యదర్శి సురేష్ కోరారు. ఈ నెల 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు గ్రామ సచివాలయంలో ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయనున్నట్లు చెప్పారు. 2010 నుంచి 2016 వరకు ఆధార్ నమోదు చేసుకుని ఇప్పటివరకు ఏ విధమైన మార్పులు చేయించుకోని వారందరూ తగిన ఆధారాలతో వచ్చి ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. సంబంధిత వలంటీర్లు కూడా వారి పరిధిలోని ప్రజలకు ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు.

ఆంజనేయ స్వామి తిరునాళ్ల రేపు


మూసీవద్ద కొలువైయున్న ఆంజనేయస్వామి

పొదిలి రూరల్: మండలంలోని ఏలూరు మూసి బ్రిడ్జి వద్ద ఒంగోలు-కర్నూలు రహదారి వెంబడి కొలువైయున్న అభయాంజనేయ స్వామి, వరసిద్ధి వినాయక స్వామి వార్ల 13వ వార్షికోత్సవ తిరునాళ్ల మంగళవారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు గోము ఆకుపూజ కార్యక్రమంతో మొదలై భక్తులు పొంగళ్లు చేసి నైవేద్యాలు పెట్టి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం ఉప్పలపాడు వాస్తవ్యులు ఉలవా గోపి అధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుంది. రాత్రికి ఏలూరు గ్రామస్తుల విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. ప్రభలపై పాటకచేరీ, కోలాటం, బ్రహ్మంగారి నాటకం ఉంటుందని కార్యనిర్వాహకుడు ధర్మవరపు ప్రసాద్ రెడ్డి తెలియజేశారు.

గురుకులం పిలుస్తోంది..



వేటపాలెం గురుకుల పాఠశాల

- జ్యోతిరావ్ పూలే గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఏప్రిల్ 4వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 260 సీట్లు

వేటపాలెం: ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలే మార్చేసింది. గత ప్రభుత్వాలు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోక నిర్వీర్యం చేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మాత్రం పేద, మధ్య తరగతి కుటుంబాలను పట్టించుకొని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకున్నాడు. అదే విధంగా అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, విదేశీ విద్య తదితర విద్యా పథకాలు ప్రవేశ పెట్టి అట్టడుగున్న ఉన్న పేద కుటుంబాల్లో వెలుగులు నింపాడు. అంతేకాదు అన్నీ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యానికి పెద్దపీట వేశాడు. ఈక్రమంలోనే గురుకులంలో ఉచిత విద్య అందించేదుకు దరఖాస్తులు కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మహాత్మ జ్యోతిరావ్ బాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతులు సంక్షేమ గురుకుల పాఠశాల విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. కార్పొరేట్ తరహాలో విద్యనందించే విద్యా సంస్థల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 4లోపు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి సీటు పొందితే వసతితో పాటు పదోతరగతి వరకూ ఉచితంగా చదువుకునే అవకాశం కలుగుతుంది. ఇంగ్లిష్ మీడియంలో బోధన చేస్తారు. విద్యార్థులు మేలో జరిగే కామన్ టాలెంట్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి ప్రవేశాలు పొందవచ్చు. బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం బాలురు గురుకుల పాఠశాలలో 80 సీట్లు, నక్షత్రనగర్ బాలిక గురుకుల పాఠశాలలో 40, వేటపాలెంలోని బాలుర గురుకులంలో 80 సీట్లు ఉన్నాయి. ప్రకాశం జిల్లాలో మార్కాపురం గురుకుల బాలిక పాఠశాలలో 80, టంగుటూరు బాలిక గురుకుంలో 20, యర్రగొండపాలెం గురుకులంలో బాలురు 40, కొండపి బాలురు గురకులంలో 40, కనిగిరి బాలిక గురుకుల పాఠశాలలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

బాపట్ల జిల్లా	గురుకులం	సీట్లు
నిజాంపట్నం	బాలురు	80
నక్షత్ర నగర్	బాలికలు	40
వేటపాలెం	బాలురు	80
ప్రకాశం జిల్లా..		
టంగుటూరు	బాలికలు	20
కొండపి	బాలురు	40
మార్కాపురం	బాలికలు	80
కనిగిరి	బాలికలు	40

ఇవీ అర్హతలు..

కుటుంబ సంవత్సర ఆదాయం రూ.1 లక్షకు మించ కూడదు. విద్యార్థి ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఏదైన పాఠశాల్లో ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతూ ఉండాలి. వయస్సు ఎస్సీ, ఎస్టీ 2010 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2014 ఆగస్టు వరకు ఓసీ, బీసీ, బీసీ-సీ విద్యార్థులకు 2012 సెప్టెంబర్ నుంచి 2014 ఆగస్టు 31వ తేదీ మధ్యన జన్మించిన వారు మాత్రమే అర్హులు. విద్యార్థి ఆధార్ కార్డు, ఫొటో, ఫోన్ నంబర్‌తో మీ దగ్గరలోని మీ-సేవా కేంద్రంలో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.

గురుకుల హాస్టల్‌లో మంచి పౌష్టికాహారం..

వారానికి రెండు సార్లు చికెన్, ఆరు సార్లు కోడి గుడ్లు, ప్రతి రోజు బూస్ట్ కలిపిన పాలు, రాగిజావ, చిక్కీలు, అరటి పండు, వారంలో రెండు సార్లు ఇడ్లీ, పూరీ, ఆలు బిర్యానీ, పులిహోరా, ఉప్మాలాంటి వంటి పౌష్టికాహారం అందిస్తారు. మోను ప్రకారం ప్రతిరోజూ భోజనం అందజేస్తారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని గమనించడానికి వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారు. ఉపాధ్యాయులు ప్రతి ఒక్క విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటారు. వివరాలకు 96188 80036, 80744 63282 సంప్రదించాల్సి ఉంటుంది.

> **గురుకులంలో అన్ని సౌకర్యాలు..**
>
> 
>
> గురుకుల పాఠశాల్లో ఇంగ్లిషు మీడియంలో విద్యా బోధనలతో పాటు అన్ని సౌకర్యాలు ఉంటాయి. ప్రభుత్వం ప్రకటించిన మోనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తారు. విద్యతో పాటు వ్యాయామం, క్రీడల్లోనూ విద్యార్థులకు ప్రోత్సహం ఉంటుంది. విద్యార్థులకు పూర్తి భద్రత కల్పిస్తారు.
>
> బీ రజనీకుమారి, ప్రిన్సిపాల్,
> గురుకుల పాఠశాల, వేటపాలెం


ప్రభపై మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలి

- శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

బల్లికురవ: గ్రామాల్లోని రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. శనివారం అర్ధరాత్రి మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామ సమీపంలోని రామలింగేశ్వరస్వామి వార్షిక తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యాకర్తలు ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభపై చైతన్య మాట్లాడి ఉత్తేజపరిచారు. అంతకు ముందు రామలింగేశ్వరుడి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి జగనన్న పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల హృదాయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. గత నాలుగేళ్లుగా సకాలంలో వర్షాలు కురుస్తూ పంటలకు గిట్టుబాటుధరలు లభించండంతో రైతులు సంతోషంగా జీవిస్తున్నారని చెప్పారు. ఆ సంతోషం వల్లనే తిరునాళ్ల వేడుకలు కూడా గ్రామగ్రామాన ఘనంగా నిర్వహిస్తున్నట్లు చైతన్య చెప్పారు. వేడుకల్లో స్థానిక నేతలు కల్లి అంజన్రీసాదరెడ్డి, దేవినేని కృష్ణబాబు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీడీవో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాజెక్ట్ ఎంపిక


నాజర్‌వలి


అరటిగుజ్జుతో తయారు చేసిన బయోప్లాస్టిక్

బల్లికురవ: అరటి గుజ్జుతో ఆన్‌లైన్‌లో బయోప్లాస్టిక్ తయారీతో రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైయిర్ పోటీలకు మండలంలోని కొప్పరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపిక య్యాడు. ఆదివారం విద్యార్థి షేక్ నాజర్ వలిని అభినందనలతో ముంచెత్తారు. పాఠశాలలో 10వ తరగతి చదువున్న నాజర్‌వలి ప్రయోగాలు ప్రాజెక్టుల తయారీపై ఉన్న మక్కువను గుర్తించిన సైన్స్ ఉపాధ్యాయులు జీ నాగేశ్వరరావు ప్రోత్సహించారు. ఇన్‌స్పైయిర్ మనక్ 2021-22 సంవత్సరానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి 15 ప్రాజెక్టులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి బీ. రమేష్ ప్రకటించారు. 23, 24 తేదీల్లో కాకినాడ డీవో కార్యాలయంలో జరిగే ఆన్‌లైన్ ఎగ్జిబిషన్‌కు నాజర్‌వలి ప్రాజెక్టు ఎంపికైయింది. అక్కడ గెలుపొందితే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని పాఠశాల హెచ్‌ఎం పీ. శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థిని హెచ్‌ఎంతోపాటు పీఎంసీ చైర్మన్ దమ్ము అంజయ్య, సభ్యులు గ్రామ సర్పంచ్ బండారు వెంకాయమ్మ గురవయ్య, స్థానికులు అభినందించిన వారిలో ఉన్నారు.

జాగ్రత్తలతో మిరప పంటను కాపాడుకోవచ్చు

కారంచేడు: అకాల వర్షాలతో మండలంలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో మిరప పంట నాశనం అవ్వకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి కే శివనాగప్రసాద్ అన్నారు. ఆదివారం ఆమె మండలంలోని పలు గ్రామాల్లోని మిరప చేలను పరిశీలించారు. మిరప రైతులు ఈ పరిస్థితుల్లో కాయకుళ్లు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సి అన్ని రకాల జాగ్రత్తలు వివరించారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం మొదటి, రెండు, మూడు దశల్లో ఉన్నాయన్నారు. ఈ కాయలు ఎక్కువగా కల్లాల్లోనే ఉండటం వలన కాయలు తడవకుండా ఉండేందుకు టార్పాలిన్ పట్టాలు కప్పుకున్నారన్నారు. మాంకోజెబ్ లీటర్ నీటికి 2.5 గ్రాములు, క్లోరోథలోనిల్ లీటర్‌కు 2 గ్రాములు, థయోఫినైట్ మిథైల్ లీటరుకు 2 గ్రాముల చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. ఒక వేళ తెగుళ్ల ఉధృతి వస్తుందనే అనుమానం ఉన్నప్పుడు నివారణకు డైఫిన్‌కోనజోల్ 0.5 మిల్లీ లీటర్, ప్రోపికొనజోల్ 1 ఎంఎల్ పిచికారీ చేసిన తరువాత కాబ్రియోటాఫ్ లీటర్‌కు 3 గ్రాముల చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. సూక్ష్మ పోషక మిశ్రమం (ఎగ్రోమిస్ మాక్స్) లీటరు నీటిలో 2.5 గ్రాముల చొప్పున కూడా పిచికారీ చేసుకోవచ్చన్నారు. వర్షాలు ఆగిన తరువాత కోత కోసి ఎండబెట్టేటప్పుడు కూడా కాయకుళ్లు ఆశించిచేట్లయితే కాయలు వేరు చేసి విడివిడిగా ఆరబెట్టుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీకేల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట


ప్రతిష్టకు ముస్తాబైన పోలేరమ్మ ఆలయం

బల్లికురవ: గ్రామస్తుల సమష్టి కృషితో మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో జీర్ణావస్థకు చేరిన పోలేరమ్మ ఆలయానికి రూ. 50 లక్షలతో పునః నిర్మాణం చేపట్టారు. సోమవారం నుంచి ప్రతిష్టా మహోత్సవాలకు అంకురార్పణతో శుక్రవారం ఉదయం 9.54 గంటలకు పోలేరమ్మ, ముత్యాలమ్మ, గంగాలమ్మ, పోతురాజు విగ్రహాలకు ప్రతిష్టించనున్నట్లు కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శైవాగమన పండితులు గూడూరు మోహనశర్మచే సోమవారం యాగశాల ప్రవేశంతో గణపతి పూజ. పుణ్యాహవచన, పంచగవ్య ప్రాసన దీక్షా ధారణ, మంగళవారం నిత్యవిధులు, మహన్యాసం హోమం, జలాధివాసం చేపట్టనున్నట్లు చెప్పారు. వేడుకల్లో గ్రామంతోపాటు పరిసరగ్రామాల్లోని భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

పంచాయతీ కార్యదర్శుల సమావేశం నేడు

చీరాల టౌన్: మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కె.నేతాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయితీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయితీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్ వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో రెవెన్యూ, విద్యార్థులు, గ్రామస్తులు, రైతుల సమస్యలపై అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. అలాగే కార్యక్రమానికి అన్ని శాఖల సిబ్బంది తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

అల్లూరికి ఉగాది పురస్కారం ప్రదానం


అల్లూరి కోటేశ్వరరావును సన్మానిస్తున్న ప్రతినిధులు

పర్చూరు: శోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా పోలూరు-పర్చూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అల్లూరి కోటేశ్వరరావుకు ఆదివారం చీరాలో ప్రదానం చేశారు. బత్తుల బ్రహ్మానందరెడ్డి స్థాపించి నిర్వహిస్తున్న బత్తుల సర్వీసెస్ ట్రస్ట్ ఈకార్యక్రమం నిర్వహించింది. ఈపురస్కారాలు మరో ఆరుగురికి ప్రదానం చేశారు. వారిలో డీవీ రమణ, ఏకాంబరేశ్వరబాబు, బాపయ్య, బీకే మూర్తి, వీ రాధాకృష్ణ, శక్తిధర్‌లు పురస్కారాలు అందుకున్నారు.

శింగరకొండ దర్శిని


అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం పాల్గుణ మాసం శతభిష నక్షత్రం చతుర్ధశి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

గ్రంథాలయాలే విజ్ఞాన కేంద్రాలు


మాట్లాడుతున్న లేబ్రేరియన్ విజయభాస్కరరెడ్డి

అద్దంకి: విద్యార్థులకు గ్రంథాలయాలు చక్కని విజ్ఞాన కేంద్రాలని సంతమాగులూరు లేబ్రేరియన్ విజయభాస్కరరెడ్డి అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో చదవడం అంటే మాకు ఇష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వీలు దొరికినప్పుడు గ్రంథాలయానికి వచ్చి ఇష్టమైన పుస్తకాలు చదవడం వల్ల విశ్వజ్ఞానంతోపాటు, లోకజ్ఞానం కలుగుతుందని చెప్పారు. అదే విధంగా తరగతి పుస్తకాలకు సంబంధించిన పుస్తకాలను చదువుకోవచ్చని, అవసరమైతే లేబ్రేరియన్ అనుమతి మేరకు ఇంటికి తీసుకుని వెళ్లి చదువుకునే వీలుంటుందన్నారు. విద్యార్థులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం


పనులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

చినగంజాం: ఇంకొల్లు సినిమా హాలు సెంటర్ నుంచి పర్చూరు రోడ్డు వై జంక్షన్ వరకు సుమారు 19 కి.మీ పొడవు కలిగి రూ.24 కోట్లతో నిర్మాణం జరుపుకుంటున్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు పనులను ఆదివారం ప్రారంభించారు. మండల కేంద్రంలో రోడ్డు మంజూరు అయినప్పటికీ పనులు ప్రారంభం కాక పెండింగ్ ఉంది. అలాంటి పరిస్థితిలో ఎంతో కాలంగా ఇంకొల్లు మండల ప్రజలు ఎదురు చూస్తున్న ప్రధాన రోడ్డుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ గత నెల 1వ తేదీన భూమి పూజ చేసి పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

అద్దంకి: పట్టణంలోని శింగరకొండకు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాల అండ్ కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 24వ తేదీన ఉదయం 10 గంటలకు 5వ తరగతికి, ఇంటర్‌కు మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష రాయాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 24వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 97045 50092 నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు.

చెస్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ


విజేతలతో పాఠశాల సిబ్బంది

మార్కాపురం: ఒంగోలులో ఈ నెల 18న జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో మార్కాపురం జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం శ్రీదేవి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డోలా శ్యామలదేవి ఆదివారం విలేకర్లకు తెలిపారు. ఒంగోలులోని ఆనంద్ మినీ స్టేడియంలో ఏపీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటిల్లో జిల్లా మొదటి బహుమతిని నాగస్వాతి, 3వ బహుమతి యం. స్నేహశ్రీ, సాధించినట్లు తెలిపారు. అండర్- 13 విభాగంలో 3వ బహుమతి టీవీ చంద్రిక సాధించి సత్తా చాటారని తెలిపారు. విజేతలకు స్పోర్ట్స్ అధికారి రాజేశ్వరి బహుమతులు అందించారు.

ముస్లింలు అన్ని రంగాల్లో రాణించాలి

చీరాల: ముస్లింలు అన్ని రంగాల్లో రాణించడంతో పాటు అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర యువత అధ్యక్షుడు సయ్యద్‌షకీల్ అహ్మద్ అన్నారు. ఆదివారం పేరాల్లో గోలి సదాశివరావు కళ్యాణ మండపంలో జాగో ముస్లిం-చలో చీరాల ముస్లింల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. వేటపాలెం నుంచి చీరాల పట్టణం వరకు ముస్లిం యువకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ముస్లిం యువత రాష్ట్ర అధ్యక్షుడిగా షకీల్, జిల్లా అధ్యక్షుడిగా ఇలియాజ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ముస్లింలు చదువు, వ్యాపార, వాణిజ్య రంగాలతో పాటుగా సమాజ సేవా కార్యక్రమాల్లో తమవంతుగా పాలుపంచుకోవాలన్నారు. యువత చదువుపై మక్కువ పెంచుకుని విద్యలో రాణించి ఉన్నతస్థాయికి చేరుకుని పేద ముస్లింలకు అండగా నిలవాలన్నారు. అనంతరం వక్ఫ్‌బోర్డు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా షేక్‌ఇమామ్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం మస్తాన్‌వలిలను రాష్ట్ర ప్రభుత్వం నియమించడంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఖదీర్‌బాషా, సర్దార్ అక్బర్, నాయబ్, ముస్లింలు పాల్గొన్నారు.


సమ్మేళనంలో మాట్లాడుతున్న ముస్లిం నేతలు